# బొగ్గు పరిశ్రమ : విదేశీ పెట్టుబడికి తెరిచిన గేట్లు

**నరేంద్రమోడీ** ప్రభుత్వం బొగ్గు అమ్మకాల్లో, బొగ్గు వెలికితీతతో, వాటికి సంబంధించిన మౌలిక వసతుల్లో అతితక్కువ షరతులతో, ఎక్కువ వెసులుబాటుతో కూడిన ఆటోమేటిక్ మార్గం ద్వారా ఎఫ్‌డిఐలను నూరుశాతం అనుమతించింది. బొగ్గుగనుల చట్టంలో, గనులు మరియు ఖనిజాల చట్టంలో ఎప్పటికప్పుడు మార్పులు చేస్తూ వస్తున్న సంస్కరణల్లో ఇది తాజాగా తీసుకున్న చర్య. మొదటగా కేంద్రప్రభుత్వం బొగ్గు, లిగ్నైట్ మైనింగులో నూరుశాతం ఎఫ్‌డిఐలకు స్టీలు, సిమెంటు, కరెంటు ఉపయోగించుకోవటానికి నూరుశాతం అనుమతించింది. తర్వాత బొగ్గు శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయటానికి నూరు శాతం ఎఫ్‌డిఐలను అనుమతించింది. విదేశీ పెట్టుబడిదారులు అంతగా ముందుకు రాక పోవటంతో ఇప్పుడు మొత్తం పరిశ్రమనంతా ఎఫ్‌డిఐల పరం చేయటానికి అన్నిగేట్లు తెరిచేసింది. సామ్రాజ్యవాద భల్లూకాలు ఇప్పుడు బొగ్గును వెలికితీయుచ్చు, దానిని అమ్మవచ్చు, దానికి సంబంధించిన మౌలిక వసతులైన శుద్ధి కేంద్రాలను, క్రషింగ్‌ను, నిర్వహణను, అన్నింటినీ చేపట్టవచ్చు.

బొగ్గు ఇంధన వనరుల్లో మౌలికమైనది. భారతదేశం 286 బిలియన్ టన్నుల బొగ్గుతో ప్రధాన వనరుల్లో ఒకటిగా వుంది. బొగ్గు మైనింగులో ఇండియా ప్రపంచంలోనే 3వ అతిపెద్ద దేశం. విద్యుత్తు, సిమెంటు, లోహాల తయారీ పరిశ్రమలకు ఇది ఆయువుపట్టైన ముడిపదార్థం. ఇప్పటివరకు కోల్ ఇండియా లిమిటెడ్(సిఐఎల్) మనదేశంలో బొగ్గు మైనింగును, అమ్మకాలను నిర్వహిస్తూ వస్తున్నది. 70 శాతానికి పైగా ప్రభుత్వ వాటాతో 83 శాతం బొగ్గును సిఐఎల్ ఉత్పత్తి చేస్తున్నది. అందులో 81 శాతం కేవలం విద్యుత్తు తయారీ కేంద్రాలకే సరఫరా చేయబడుతోంది. ఇంత అతిపెద్ద సహజ ఇంధన వనరును సామ్రాజ్యవాద పెట్టుబడికి బంగారు పళ్ళెంలో పెట్టి మరీ అప్పగించబోతున్నారు.

ఎఫ్‌డిఐల ప్రవేశాన్ని స్వాగతిస్తున్న వారు వీటివల్ల పోటీ ఏర్పడుతుందని, కొత్త సాంకేతిక పరిజ్ఞానం తీసుకువస్తాయని, బొగ్గు దిగుమతులు తగ్గుతాయని, తద్వారా బొగ్గు ధరలు తగ్గుతాయని రకరకాల వాదనలు చేస్తున్నారు. దీనివల్ల రాబోయే తక్షణ ప్రమాదాలు బాగా తెలిసినవే. ఇంత పెద్ద ఇంధన వనరు అత్యధిక లాభాలు సంపాదించటమే లక్ష్యంగా పనిచేసే విదేశీ కంపెనీల చేతుల్లో పడితే భారత ఆర్థిక వ్యవస్థపై దాని పరిణామాలు అనేక రూపాల్లో బహు తీవ్రంగా వుంటాయి. ఈ అభివృద్ధి ఫలాలు భారత ప్రజలకు అందకుండా విదేశీ పెట్టుబడి ఎగరేసుకుపోతుంది. మరో ఇంధన వనరు అయిన గ్యాసు మరియు ఆయిల్ వెలికితీతలో ఇదే విధానాన్ని అమలుపరిచిన అనుభవం తెలియజేస్తున్నదేమంటే మన దేశానికి చెందిన ఇంధన వనరులను ఉపయోగించు కోవటానికి బహుళజాతి కంపెనీలు మన ప్రజల వద్దనుండి ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్నాయి.

ఈ విధానం వాస్తవరూపం దాల్చాలంటే ప్రభుత్వం భూసేకరణను, అటవీ మరియు పర్యావరణ అనుమతులను త్వరితం చేయాల్సి వుంటుంది. విదేశీ పెట్టుబడి లాభాలు, రాయల్టీలు, వడ్డీలు, సాంకేతిక ఫీజుల వంటి వివిధ రూపాల్లో మన సంపదను తరలించుకు పోతే, మన ప్రజలు మాత్రం ధ్వంసమైన పర్యావరణపు దుష్ఫలితాలననుభవించే వారిగా, జీవనోపాధిని కోల్పోయే వారిగా మిగిలిపోతారు. ప్రత్యేకించి ఆదివాసులు తమ భూములనుండి బలవంతంగా నెట్టివేయబడతారు. దీనికొరకు ముందస్తుగానే ప్రభుత్వం అటవీ చట్టాలకు మార్పులుచేసి, తన చర్యలకు అనుకూలమైన తీర్పులు వచ్చేలా న్యాయవ్యవస్థను ప్రభావితం చేస్తున్నది.

లాభాల రంధిలో విదేశీ పెట్టుబడి – కార్మికుల, పెద్దసంఖ్యలోని ప్రజల ఆరోగ్యం గురించి, భద్రతా ప్రమాణాల గురించి ఏమాత్రం పట్టించుకోదనే విషయం స్పష్టమే. కార్మిక చట్టాలన్నింటినీ తుంగలో తొక్కుతూ దుర్భరమైన పరిస్థితుల మధ్య కార్మికులతో పని చేయిస్తారు. అన్ని ప్రభుత్వాలు కార్మిక చట్టాల కోరలు పీకివేస్తూ ప్రభుత్వ యంత్రాంగాన్ని ఇప్పటికే నిస్తేజంగా మార్చాయి.

కేంద్రంలోనూ, రాష్ట్రాలలోనూ అధికారంలో వున్న శక్తులు పర్యావరణాన్ని కాపాడతామని, ప్రజల హక్కులను కాపాడతామని ఎంతెంత వాగ్దానాలు చేసినా, లాభాలను నిరంతరంగా పెంచేందుకు గత ఏడు దశాబ్దాలుగా అవన్నీ బుట్టదాఖలవుతుండటమే ప్రజల చేదు అనుభవంగా వుంది. ప్రభుత్వం, ఇతర విధాన సంస్థలు అన్నీ దీన్ని చూస్తూ కూడా మౌనంగా వున్నాయి.

బొగ్గు పరిశ్రమలోకి ప్రవేశించిన విదేశీ పెట్టుబడి జీవావరణానికి హాని కల్గిస్తుంది. కోట్లాది ప్రజల జీవనోపాధిని దెబ్బతీసి వాళ్ళ జీవితాలను ధ్వంసం చేస్తుంది. సహజ వనరులపై ప్రజల హక్కు పోయి, ఇంధన వనరులనుండి సూపర్ లాభాలు దానికి చేరతాయి. విదేశీ పెట్టుబడికి ఈవిధంగా దాసోహమవటానికి వ్యతిరేకంగా తీవ్రంగా పోరాడాల్సి వుంది.

ooo